RNI No.: TELTEL/2023/90269

# తెలంగాణ షాన్

ప్రతి పదం ప్రజల పక్షం

తెలుగు దిన పత్రిక

# TELANGANA SHAAN

Telugu Daily

విలేకరులు కావలెను

తెలంగాణ షాన్

తెలుగు దినపత్రిక

నందు రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
నియోజకవర్గ ఇన్చఛార్జ్‌లు
మండలాల వారిగా విలేకరులు కావలెను

ఆసక్తి గల యువతీ యువకులు

సంప్రదించవలసిన మొబైల్
నెంబర్: 99637 08331

Malkajgiri | Volume: 3 | Issue: 95 | Saturday, July 19, 2025 | Editor: RAMANCHARLA SRIKANTH | Pages: 4 | Rs. 4/-

మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 95 | శనివారం, జూలై 19, 2025 | ఎడిటర్: రామన్‌చర్ల శ్రీకాంత్ | పేజీలు : 4 | వెల : రూ.4 /-

### ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు..

## ఆరుగురు మావోలు మృతి



**రాయ్‌పూర్:** ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. నారాయణ్‌పూర్ జిల్లాలోని అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో మావోలు, భద్రతా బలగాల మధ్య జరిగిన ఎదురుకాల్పులలో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దుల్లో శుక్రవారం మధ్యాహ్నం ఈ ఘటన చోటు చేసుకుంది. మావోయిస్టులు ఉన్నారనే ఇంటెలిజెన్స్ సమాచారంతో పోలీసులు అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో మావోలు ప్రతిదాడి చేసేందుకు కాల్పులు జరిపారు. దీంతో ఇరు వర్గాల పరస్పరం కాల్పులు జరుపుకున్నాయి. ఈ ఘటనలో మృతి చెందిన ఆరుగురు మావోల మృతదేహాలతో పాటు భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఇందులో ఎకె-47, ఎస్ఎల్ఆర్ రైఫిల్స్, కొన్ని పేలుడు పదార్థాలు ఉన్నాయని సీనియర్ పోలీసు అధికారి ఒకరు వెల్లడించారు.

## తెలంగాణ వాదాన్ని బిఆర్ఎస్ మళ్లీ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోంది: బండి



**హైదరాబాద్:** బనకచర్ల జలవివాదం పరిష్కరించాలని ప్రయత్నిస్తే రెండు రాష్ట్రాలు తప్పుబడుతున్నాయని కేంద్రమంత్రి బండి సంజయ్ తెలిపారు. జలవివాదాన్ని కమిటీ పరిష్కరిస్తుందని అన్నారు. జనగామ జిల్లాలో ఎపి, తెలంగాణ జలవివాదంపై బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. నీటి విషయంలో రెండు రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడతాం అని తెలియజేశారు. తెలంగాణ వాదాన్ని బిఆర్ఎస్ మళ్లీ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నట్టు అనుమానం ఉందని, ఏ ఒక్క స్కామ్ లోనూ మాజీ సిఎం కెసిఆర్ కుటుంబాన్ని ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. రెండు పార్టీల నేతలు తిట్టుకోవడమే పనిగా పెట్టుకున్నారని బండి సంజయ్ ఎద్దేవా చేశారు.

### హైదరాబాద్‌లో భారీ వర్షం..

## వాతావరణ శాఖ హెచ్చరిక



**హైదరాబాద్:** నగరంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో నగరం మొత్తం మేఘావృత్తం అయింది. కాసేపటికే భారీ వాన కురిసింది. దీంతో ప్రధాన రహదారులన్ని జలమయం అయ్యాయి. ఫలితంగా రోడ్లపై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదురుకున్నారు.

నగరంలోని అన్ని ప్రధాన ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. వర్షం కారణంగా పలు చోట్ల ట్రాఫిక్ జామ్ అయింది. ఉప్పల్‌లో రోడ్డుపైకి భారీగా వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఉప్పల్ స్టేడియం నుంచి హబ్సిగూడ వరకూ ట్రాఫిక్ నిలిచిపోయింది. యూసుఫ్‌గూడ, కృష్ణానగర్ ప్రాంతాల్లో కొన్ని చోట్ల మ్యాన్‌హోల్స్ తెరుచుకున్నాయి. కాగా, జిహెచ్ఎంసి పరిధిలో రాత్రి వరకూ భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. భాగ్యనగర వాసులంతా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేసింది.

### ప్రజలే తమ ఆస్తులు కాపాడుకోవాలి..

## హైడ్రా కమిషనర్ రంగనాథ్ పిలుపు



**హైదరాబాద్:** ఆక్రమణదారులకు చిక్కకుండా ప్రజలే తమ ఆస్తులను పరిరక్షించుకోవాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పిలుపునిచ్చారు. హైడ్రా తొలి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ అంబర్ పేటలోని బతుకమ్మకుంట వద్ద విద్యార్థులు, స్థానికులతో కలిసి నేడు పెద్దఎత్తున మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, కాంగ్రెస్ నేత వి. హనుమంతరావుతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. వారందరితో నీటి వనరుల పరిరక్షణపై రంగనాథ్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ ఏడాది సెప్టెంబర్ లో బతుకమ్మ సంబురాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇక్కడి నుంచే ప్రారంభిస్తారని తెలిపిన రంగనాథ్.. అందుకు అనుగుణంగా బతుకమ్మకుంటను పూర్తిస్థాయిలో తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. "ఏడాదిలో హైడ్రాకు ఎన్నో మంచి, చెడు అనుభవాలు ఎదురయ్యాయి. విపత్తుల నిర్వహణకు సంబంధించి పక్కా ప్రణాళికతో హైడ్రా పనిచేస్తుంది. ఏడాదిలో 500 ఎకరాల ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాం. హైడ్రా పరిరక్షించిన స్థలాల విలువ దాదాపు రూ.30 వేల కోట్లపైనే ఉంటుంది. ఆరు చెరువులను పునరుద్ధరిస్తున్నాం, వాటి విస్తీర్ణం రెట్టింపు స్థాయిలో పెరిగింది. రహదారులపై, మూసీలో వృథాగా పోయే నీటిని చెరువుల్లోకి మళ్లిస్తున్నాం. ఆక్రమణలకు గురైన చెరువులు, కుంటలు, నాలాలను పరిరక్షిస్తున్నాం. న్యాయపరమైన సవాళ్లను కూడా అధిగమిస్తూ భూములను కాపాడుతున్నాం. కూల్చడమే కాదు నిర్మాణం చేయాలనేది సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్ష. రాబోయే రోజుల్లో పెద్ద సంఖ్యలో చెరువులను హైడ్రా అభివృద్ధి చేస్తుంది. చెరువులు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు. ఆక్రమణలను నివారించడంతో పాటు.. హైడ్రా రాకముందు నిర్మించుకున్న ఇళ్లకు మినహాయింపు ఇచ్చాం. ప్రభుత్వం హైడ్రాకు ఒక నిర్దిష్టమైన విధానాన్ని సూచించింది. సుప్రీంకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగానే హైడ్రా పనిచేస్తుంది. ఆక్రమణల వెనుక చాలా మంది పెద్దవాళ్లు ఉంటారు. వాళ్లు తప్పించుకోవడానికి పేదలను బుల్డోజర్ల ముందు పెడుతున్నారు. పేదవాళ్ల మీద హైడ్రా పగబట్టిందని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయిస్తున్నారు. రూ. 30-40 కోట్ల పార్క్ స్థలాన్ని ఆక్రమించే ధైర్యం పేదవాళ్లకు ఉంటుందా. హైడ్రాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు.

## కేసీఆర్ వల్లే పాలమూరు ప్రాజెక్టు పూర్తి కాలే: రేవంత్ రెడ్డి..



**నాగర్ కర్నూల్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తి చేయడంలో తన నిబద్ధతను ప్రకటించారు. ఈ ప్రాజెక్టుతోపాటు దిండి, కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి కీలక ప్రాజెక్టులను అడ్డుకునే ప్రయత్నాలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ రద్దు చేసుకోవాలని, అందుకు సహకరించాలని సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. సహకారం లేకపోతే పోరాటం తప్పదని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేయడం తన బాధ్యత అంటూ స్పష్టం చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం జటప్రోలులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు.

అంతేకాదు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ని ఉద్దేశిస్తూ 'నీ గుండె, నీ కుమారుడి గుండె మీద కూడా రాసుకో.. మరో పదేళ్లు నేనే సీఎంగా ఉంటా' అని రేవంత్ పేర్కొన్నారు. ఈ పాలమూరు బిడ్డే తెలంగాణను ప్రజా ప్రభుత్వంతో నడిపిస్తాడని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను అసెంబ్లీకి రావాలని, ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను చూసి నేర్చుకోవాలని హితబోధ చేశారు రేవంత్. 'నీకు దుఃఖమొస్తే ఏడ్చినా, బావిలో దూకినా, నీ ఇష్టం' కానీ తెలంగాణ ప్రజల కోసం తాము చేసే మంచి పనులను చూస్తూ ఉండాలని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే పాలమూరు ప్రాంతం సస్యశ్యామలంగా మారి, రైతుల జీవనోపాధికి బలమైన ఆధారంగా నిలుస్తాయని ముఖ్యమంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

**రూ.200 కోట్ల వ్యయంతో...**

నాగర్‌కర్నూల్ జిల్లా జటప్రోలులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా పాలమూరు ప్రాంత అభివృద్ధికి కొత్త ఊపిరి లభించింది. ఈ సందర్భంగా రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన జరిగింది. ఈ స్కూల్ విద్యార్థులకు ఆధునిక విద్య, సౌకర్యాలతో ఉజ్వల భవిష్యత్తును అందించనుంది. ఈ సందర్భంగా కొల్లాపూర్ అభివృద్ధికి అవసరమైన నిధులను పూర్తిగా అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

**పాలమూరు పట్ల కేసీఆర్‌కు చిన్నచూపు**

గతంలో కేసీఆర్ నాయకత్వంలో పాలమూరు పట్ల నిర్లక్ష్యం జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్.. పాలమూరు ప్రజల సమస్యలను ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. వరద బాధితులకు ఇళ్లు కట్టిస్తానని చెప్పిన కేసీఆర్.. ఆ హామీని ఎందుకు నెరవేర్చలేదన్నారు. రూ.25వేల కోట్లు ఖర్చు చేసి ఉంటే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ఇప్పటికే పూర్తయ్యేదన్నారు రేవంత్. అదే సమయంలో రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం మూడేళ్లలో కూలేశ్వరంగా మారిందని ఎద్దేవా చేశారు.

**ప్రాజెక్టులకు కొత్త ఊపు**

ఈ సందర్భంగా సీఎం రేవంత్, పాలమూరు ప్రాజెక్టులను రెండేళ్లలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. డిసెంబర్‌లోగా భూసేకరణ పూర్తి చేసి, కృష్ణా జలాలను పొలాలకు తీసుకొస్తామని అన్నారు. 'మా పొలాల్లో కృష్ణా నీళ్లు పారుతుంటే, కొందరు దీనిని ఓర్చుకోలేకపోతున్నారు. కేసీఆర్ లాంటి వాళ్లు విషం చిమ్ముతున్నారని' రేవంత్ వ్యాఖ్యానించారు. పాలమూరు పచ్చగా మారితే, రైతులు సంతోషంగా ఉంటారని, అది కొందరికి కడుపుమంటగా ఉందని మండిపడ్డారు.

**రైతులకు రుణమాఫీ, బోనస్**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రూ.21వేల కోట్ల రైతు రుణమాఫీ చేసినట్లు సీఎం రేవంత్ తెలిపారు. 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధులు విడుదల చేశామని, వరి పండించిన రైతులకు బోనస్ కూడా ఇస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంటు ఉండదని కొందరు అన్నారని, కానీ తాము 24 గంటలూ ఉచిత కరెంటు ఇస్తున్నామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## రాములమ్మ అలక!

### సైలెంట్ మోడ్‌లో విజయశాంతి



**హైదరాబాద్:** తెలంగాణలో రాజకీయాలన్నీ స్థానిక సంస్థల ఎన్నికల చుట్టూ తిరుగుతున్నాయి. ఈసారి జరగబోయే ఎన్నికల్లో సత్తా చాటేందుకు కాంగ్రెస్ పార్టీ రెడీ అవుతోంది. ఇందులో భాగంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు త్వరలోనే ఆర్డినెన్స్ తీసుకురాబోతోంది. ఇప్పటికే కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు ఊరూరా తిరుగుతూ.. కేడర్‌ను యాక్టివ్ చేస్తున్నారు. కానీ, అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్సీ విజయశాంతి మాత్రం పార్టీ లీడర్లకు అందుబాటులో లేకుండా పోయారు. రాములమ్మ సినీ, పొలిటికల్ గ్లామర్ పార్టీకి, ప్రభుత్వానికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్సీ పదవి అప్పగిస్తే.. ఆమె సైలెంట్ మోడ్‌లో ఉండటం హస్తం పార్టీ నేతలకు షాక్‌కు గురి చేస్తోంది. ఎందరో ఆశావహులు ఉన్నా వారందరినీ పక్కన పెట్టి పిలిచి మరీ అవకాశమిస్తే ఎమ్మెల్సీ పదవి వచ్చాక విజయశాంతి ఎక్కడా కనిపించడం లేదని అధికార పార్టీ నేతలు బహిరంగంగానే చర్చించుకోవడం హాట్‌టాపిక్‌గా మారింది. కానీ, ఆమె మాత్రం ఎమ్మెల్సీ కంటే ఎక్కువగా మంత్రి పదవి కూడా ఆశించారని, అది దక్కకపోవడంతో ఎమ్మెల్సీ పదవి వచ్చినా.. పార్టీపై గుర్రుగా ఉన్నట్టుగా తెలుస్తోంది.

**ఒకటి రెండుసార్లే మీడియా ముందుకు..**

తెలంగాణ ఉద్యమంతో అనుబంధం ఉన్న విజయశాంతి.. గతంలో బీఆర్ఎస్, బీజేపీలో పనిచేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. దాంతో ప్రచార కమిటీలో కీలక బాధ్యతలు పార్టీ అప్పగించింది. ఆ తర్వతా అధికారంలోకి వచ్చాక విజయశాంతి పూర్తిగా సైలెంట్ అయ్యారు. ఈ క్రమంలో పదవి ఇస్తే పార్టీకి ఫైర్ బ్రాండ్‌గా మారుతారని లెక్కలు వేసుకుని ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇస్తే ఇప్పుడేమో సైలెంట్ అయి పార్టీ లీడర్లకు, కేడర్‌కు దూరంగా ఉంటున్నట్టు తెలుస్తోంది. కాగా, గతాన్ని పక్కన పెడితే ఇక నుంచి విజయశాంతి యాక్టివ్‌గా ఉంటారని, పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటారని కాంగ్రెస్ నేతలు చెప్పుకొచ్చారు. ప్రభుత్వంపై, పార్టీపై విమర్శలు చేస్తే తనదైన శైలిలో స్పందిస్తారని భావించారు. అయితే.. విజయశాంతిలో పార్టీ ఆశించిన మార్పు రాలేదనే చర్చ జరుగుతోంది. తాను ఎమ్మెల్సీ అయిన రోజు ఫార్మాలిటీగా అందరితో పాటు ప్రెస్ మీట్లో పాల్గొన్న విజయశాంతి.. ఆ తర్వాత మీడియాకి దూరంగా ఉన్నారు. ఇటీవల శంషాబాద్ నోవాటెల్ హోటల్‌లో జరిగిన సీఎల్పీ సమావేశంలో, హెచ్ఐసీసీలో నిర్వహించిన భారత్ సమ్మిట్‌లో మినహా ఎక్కడా కనిపించలేదు. రాష్ట్రంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న పథకాలపై గానీ ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలపై గానీ విజయశాంతి స్పందించడం లేదు.

# తెలంగాణ షాన్

## సంపాదకీయం

### అల్బనీస్‌పై ఆంక్షలు అహంకారపూరితం

పాలస్తీనా భూభాగాల్లో మానవ హక్కుల ఉల్లంఘనలను దర్యాప్తు చేయడానికి ఐక్యరాజ్యసమితి నియమించిన ప్రత్యేక రిపోర్టర్, స్వతంత్ర నిపుణురాలు ఫ్రాన్సెస్కా అల్బనీస్‌పై అమెరికా విదేశాంగ మంత్రి మార్క్ రూబియో ప్రెసిడెన్షియల్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ప్రకారం ఆంక్షలు విధించడం అప్రజాస్వామికం. యునైటెడ్ స్టేట్స్, ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా రాజకీయ, ఆర్థిక యుద్ధప్రచారం నిర్వహిస్తున్నారన్న నెపంతో ఆమెపై ఆంక్షలు విధించడం ఏ రకంగానూ సమంజసం కాదు. ప్రజాస్వామ్యం గురించి అనునిత్యం నీతులు వల్లించే అమెరికా సాక్ష్యాత్తు ఐక్యరాజ్యసమితి స్వతంత్ర నిపుణురాలిపై ఈ రకంగా ఆంక్షలు విధించి విషమ పరిస్థితులకు గురిచేయడం కడు గర్హనీయం. ఒక రకంగా అంతర్జాతీయ సంస్థల ఉద్దేశాలను, లక్ష్యాలను అమెరికా ధ్వంసంచేస్తూ అప్రజాస్వామ్యానికి నిదర్శనంగా నిలుస్తూనే ఉంది అని చెప్పవచ్చు. ఐక్యరాజ్యసమితి కౌన్సిల్‌లోని దేశాలు ఆయుధ నిషేధం విధించాలని, ఇజ్రాయెల్‌తో వాణిజ్య, ఆర్థిక సంబంధాలను తెంచుకోవాలని ఫ్రాన్సెస్కా అల్బనీస్ పిలుపునిచ్చారు. గాజా లో ఇజ్రాయెల్ ప్రవర్తనను జాతి నిర్మూలన చర్యలు, అంతర్జాతీయ చట్ట ఉల్లంఘనలుగా ఆమె అభివర్ణించారు. వృత్తి ఆర్థిక వ్యవస్థ నుండి జాతి విధ్వంసం వరకు అంటూ ఫ్రాన్సెస్కా అల్బనీస్ నివేదికను ప్రచురించారు. 'ఆయుధ తయారీదారుల నుండి ఆర్థిక సంస్థల వరకు 48 మంది కార్పొరేట్ వ్యక్తులను ఇజ్రాయెల్ ప్రభుత్వంతో వారి సహకారం ఆధారంగా లాభాన్ని ఆర్జించారు' అని ఆమె నివేదికలో ఆరోపించారు. దీనిని సహించని అమెరికా అన్యాయంగా ఆమెపై ఆంక్షలు విధించి తన దమననీతిని బట్టబయలు చేసుకోవడం విడ్డూరంగా ఉంది. ఐక్యరాజ్యసమితి వ్యవస్థలో ఫ్రాన్సెస్కా అల్బనీస్‌ని పదవినుండి తొలగించాలని లక్ష్యంగా పెట్టుకున్న అమెరికా ఒత్తిడి ప్రచారం చిట్టచివరికి విఫలమైన తర్వాత ఈ రకమైన ఆంక్షలు ముందుకువచ్చాయ ని స్పష్టంగా అర్థమవుతుంది. ఆమెపై ఇలా అన్యాయంగా ఆంక్షలు విధించడం అంతర్జాతీయ మానవ హక్కుల వ్యవస్థను మరింతగా బలహీనపరుస్తుంది. స్పెషల్ రిపోర్టర్లపై ఈ రకమైన ఏకపక్ష ఆంక్షలను అమెరికా విధించడం ఏమాత్రం సమంజసం కాదు. ఫ్రాన్సెస్కా అల్బనీస్ ఇప్పుడు ఆస్తుల ఫ్రీజింగ్, ప్రయాణ ఆంక్షలను ఎదుర్కొనడం బాధాకరం. 'ఈ ఆంక్షలు నన్ను తిరగకుండా నిరోధించవచ్చు. సాధారణంగా నాతో నిమగ్నమయ్యే వ్యక్తులపై ఈ ఆంక్షలు ప్రభావాన్ని చూపిస్తాయి. అమెరికా నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా ఉన్న మానవ హక్కుల పరిరక్షకులకు ప్రమాదకరమైన సంకేతంగా నిలిచింది' అని ఫ్రాన్సెస్కా అల్బనీస్ పేర్కొనడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు. అమెరికా తనపై ఆంక్షలు విధించడాన్ని ఫ్రాన్సెస్కా అల్బనీస్ ఖండించి ఈ ఆంక్షల చర్యను 'అపరాధ భావన'గా అభివర్ణించారు. 'శక్తివంతులు శక్తి లేని వారి కోసం మాట్లాడే వారిని శిక్షించడం బలానికి సంకేతం కాదు. అది అపరాధానికి సంకేతం. తనపై అమెరికా విధించిన ఆంక్షలను మాఫియా తరహా బెదిరింపులను తలపిస్తున్నాయి. విమర్శకులను శిక్షించే ప్రయత్నంలో భాగంగానే అమెరికా ఈ తరహా ఆంక్షలు విధిస్తూనే ఉంది అని అవగతం అవుతుంది. ప్రపంచ సమస్యలపై నివేదించడానికి ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి నియమించిన నిపుణులలో ఫ్రాన్సెస్కా అల్బనీస్ ఒకరుగా ఉన్నారు. మానవ హక్కుల మండలి ప్రత్యేక విధానాలు అని పిలువబడే దాని కింద ప్రత్యేక రిపోర్టర్లను నియమిస్తారు. కౌన్సిల్ ఆదేశాన్ని నెరవేర్చడంలో స్పెషల్ రిపోర్టర్లు ఒక ముఖ్యమైన పాత్రని పోషిస్తున్నారు. వారు ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కుల సమస్యలను పర్యవేక్షించడానికి, నివేదించడానికి నియమించబడిన స్వతంత్ర నిపుణులుగా కొనసాగుతారు. వారు జెనీవాలోని కౌన్సిల్‌కు, అలాగే న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీకి క్రమం తప్పకుండా నివేదిస్తారు. ఈ నిపుణులు వారి వ్యక్తిగత హోదాలో పనిచేస్తారు. ఫ్రాన్సెస్కా అల్బనీస్ ఒక అంతర్జాతీయ మానవ హక్కుల న్యాయవాది. ఆమె జార్జ్‌టౌన్ విశ్వవిద్యాలయంలోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది స్టడీ ఆఫ్ ఇంటర్నేషనల్ మైగ్రేషన్‌లో అనుబంధ స్కాలర్, మధ్యప్రాచ్యంలో నిపుణురాలు. ఆమె ఆక్రమిత పాలస్తీనా భూభాగాల్లో మానవ హక్కులపై ఐక్యరాజ్యసమితి ప్రత్యేక నిపుణురాలుగా కొనసాగుతున్నారు. 2023 అక్టోబర్‌లో గాజాలో యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి ఆమె ఇజ్రాయెల్ యుద్ధ చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ శాంతికోసం కృషి చేస్తూనే ఉన్నారు. గాజా ప్రాంతంలో పాలస్తీనియన్లపై ఇజ్రాయెల్ నిరాటకంగా కొనసాగిస్తున్న యుద్ధాన్ని 'జాతిహత్య'గా ఫ్రాన్సెస్కా అల్బనీస్ అభివర్ణించారు. ఇజ్రాయెల్ నిరాటకంగా కొనసాగిస్తున్న యుద్ధోన్మాదాన్ని 'ఆధునిక చరిత్రలో అత్యంత క్రూరమైన మారణహోమాలలో ఒకటి' అని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలిని ఉద్దేశించి ఆమె పేర్కొనడం గమనార్హం. అంతర్జాతీయ సంస్థలు నియమించిన వ్యక్తులపై దాడులు, ఆంక్షలు, బెదిరింపులను నియంత్రించాల్సిన అవసరం తప్పకుండా ఉంది. శాంతి కోసం కృషి చేస్తున్న ఫ్రాన్సెస్కా అల్బనీస్‌పై ఆంక్షలు విధించడం పట్ల ప్రపంచవ్యాప్తంగా ఆందోళన వ్యక్తం అవుతూనే ఉంది. ఆంక్షలు ప్రమాదకరమైన ప్రమాణాలను నెలకొల్పుతాయని ఐక్యరాజ్య సమితి నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. ప్రత్యేక రిపోర్టర్, స్వతంత్ర నిపుణురాలు ఫ్రాన్సిస్కా అల్బనీస్‌పై అమెరికా ఆంక్షలను వెనక్కి తీసుకోవాలని ఐక్యరాజ్యసమితిసహా అనేక సంస్థలు డిమాండ్ చేస్తూనే ఉన్నాయి. అంతిమంగా ఫ్రాన్సిస్కా అల్బనీస్‌పై తక్షణమే ఆంక్షలను ఎత్తివేయాల్సిన అవసరం తప్పకుండా ఉంది. ఈ దిశగా ప్రగతిశీల ప్రజాస్వామ్యశక్తులు ఉద్యమించాల్సిన అవసరం తప్పకుండా ఉంది.

# ప్రజల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర పథకాల అమలు ముఖ్యం: ఈటెల రాజేందర్











**మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా, తెలంగాణ షాన్, జులై 18:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు ద్వారా బలహీన వర్గాలకు చేయూత నందించడంతో పాటు, జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించాలని మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు, జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ (దిశ) కమిటీ ఛైర్మన్ ఈటెల రాజేందర్ అన్నారు. సమస్యలను చర్చించడానికి మాత్రమే కాకుండా, వాటికి పరిష్కారాలను కనుగొనడానికి సమావేశం కావాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా దిశ కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించిన ఈటెల రాజేందర్, జిల్లాలోని అన్ని శాఖల ద్వారా కేంద్ర, రాష్ట్ర పథకాల అమలు, పురోగతిని సమీక్షించారు. ఈ సమావేశంలో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, మెంబర్ సెక్రటరీ జిల్లా కలెక్టర్ మను చౌదరి పాల్గొన్నారు.

**పథకాల అమలులో పారదర్శకత, ప్రజా విశ్వాసం:**

సంక్షేమ పథకాల లబ్దిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని అధికారులను ఈటెల రాజేందర్ ఆదేశించారు. అధికారులు చేసే పనుల ద్వారా వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కల్పించాలని ఆయన నొక్కి చెప్పారు. ముఖ్యంగా, పరిష్కారం కాని సమస్యలపై దృష్టి సారించి, వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల మధ్య వ్యత్యాసం చూపకుండా, ప్రజలకు సత్ఫలితాలు అందేలా చూడాలని స్పష్టం చేశారు.

**మౌలిక వసతుల కల్పనపై దృష్టి:**

జవహర్ నగర్, బాలాజీ నగర్‌లోని డబుల్ బెడ్రూమ్ ఇళ్ల సముదాయాలలో తాగునీరు, విద్యుత్తు, రోడ్లు, రవాణా, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల కొరత ఉందని, అక్కడ నివసిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఛైర్మన్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వీలైనంత త్వరగా వారికి అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా, డబుల్ బెడ్రూమ్ ఇళ్ల వద్ద ఒక అంగన్‌వాడీ సెంటర్, వైద్య సదుపాయం కల్పించాలని సూచించారు.

**పథకాల ప్రగతిపై సమీక్ష:**

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద జిల్లాలో గ్రామీణ పేదలకు 17,911 జాబ్ కార్డులు అందించి, 19,322 మందికి రూ. 10.89 లక్షల వేతనాలు అందించినట్లు %ణ=ణూ% ఇంచార్జి పీడీ కాంతమ్మ వివరించగా, ఆయన ఈ పురోగతిని గుర్తించారు. దీన్ దయాల్ అంత్యోదయ యోజన - జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ కింద 2025-26 ఆర్థిక సంవత్సరానికి జూలై 2025 నాటికి 75.27 శాతం లక్ష్యాన్ని సాధించినందుకు అభినందించారు. దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన కింద 2,598 మందికి శిక్షణ అందించి, 1,804 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

జాతీయ సామాజిక సహాయ పథకం కింద 11 కేటగిరీల లబ్ధిదారులకు ప్రతి నెలా రూ. 34,43,43,184/- పింఛన్లు అందిస్తున్నట్లు, అలాగే ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద పూర్తయిన 30,068 డబుల్ బెడ్రూమ్ ఇళ్లలో 29,094 ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించినట్లు, మిగిలిన 974 ఇళ్లను త్వరగా కేటాయించాలని అధికారులను ఆదేశించారు. జాతీయ పట్టణ జీవనోపాధి మిషన్ కింద మెప్మా ద్వారా 3,273 మంది వీధి వ్యాపారులకు ఉపాధి కల్పించడం అభినందనీయమన్నారు. సమగ్ర శిక్షా అభియాన్ పథకం కింద జిల్లాలోని 507 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 87,054 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, యూనిఫాం అందిస్తున్నందుకు విద్యాశాఖ అధికారులను అభినందించారు.

**అధికారులకు సూచనలు, ప్రజా ప్రతినిధులకు భరోసా:**

వివిధ శాఖల పథకాల పురోగతిని సమీక్షించిన అనంతరం, ఈటెల రాజేందర్ అధికారులకు సలహాలు, సూచనలు అందించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా కలెక్టర్ ద్వారా తన దృష్టికి తీసుకురావాలని, అవసరమైన నిధులు, పనులకు ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా అధికారులను కోరారు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రతి పేదవారికి లబ్ది చేకూర్చేందుకు జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేయాలని, అందుకు తన పూర్తి సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల సమస్యలను ఛైర్మన్, కలెక్టర్ దృష్టికి తీసుకువస్తూ తగిన సలహాలు, సూచనలు వివరించారు. ప్రజా ప్రతినిధుల సలహాలు, సూచనలను తప్పక పరిగణనలోకి తీసుకుని, సమస్యలను పరిష్కరించి, జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని జిల్లా కలెక్టర్ మను చౌదరి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరా మహిళా శక్తి మైనారిటీ మహిళ లబ్దిదారులకు కుట్టుమిషిన్ల పంపిణి










**కుత్బుల్లాపూర్ జూలై 18 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమినీ నాగరాజ్ గౌడ్** తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టాపకంగా చేపడుతున్న ఇందిరా మహిళ శక్తి ద్వారా మైనారిటీ మహిళ అర్హకులకు ఇంచార్జి మినిస్టర్ దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో (200) కుట్టుమిషిన్ల పంపిణి చేసిన లికుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి . ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రణాళికతో ఉందన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

## బాలాజీ నగర్‌లో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత



**బాలాజీ నగర్ – తెలంగాణ షాన్, జూలై 18:**
జవహర్ నగర్‌లోని బాలాజీ నగర్ పరిధిలో నేడు, జూలై 19వ తేదీ, రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. 33/11కేవీ బాలాజీ నగర్ సబ్‌స్టేషన్ నుండి వచ్చే 11కేవీ సాయిబాబా ఫీడర్‌పై ఏబీ స్విచ్ ఏర్పాటు పనులు జరుగుతున్నందున ఈ అంతరాయం ఏర్పడుతుంది. నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించడానికి ఈ నిర్వహణ పనులు అవసరం.విద్యుత్ సరఫరా నిలిపివేత ప్రాంతాల వివరాలు ,బాలాజీ నగర్ మెయిన్ రోడ్డు, వీఆర్‌ఓ ఆఫీస్, మోహన్ రావు కాలనీ, వెంకటేశ్వర కాలనీ, సిల్వర్‌సీ గల్లీ, మార్కెట్ రోడ్డు, సాయిబాబా టెంపుల్ కామన్ రోడ్డు, బృందావన్ కాలనీ, ఆనంద్ నగర్, శాంతి నగర్, గీతాంజలి స్కూల్, వీరభద్ర కాలనీ, చంద్రపురి కాలనీ, భక్తబాయి కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, ప్రజలు సహకరించాలని ఏఈ/ఆపరేషన్స్/బాలాజీ నగర్, హెచ్. శంభశివ రావు కోరారు.

## నిరుపేదల ఆశాజ్యోతిగా మారిన భీమ్ దళ్ సోలార్ తోపుడు బండ్ల పంపిణీ



**జవహర్ నగర్, తెలంగాణ షాన్, జూలై 18:** భీమ్ దళ్ వ్యవస్థాపకులు, రాష్ట్ర అధ్యక్షులు తీగుళ్ళ శివ సూచన మేరకు, డాక్టర్ వివేక్ వెంకటస్వామి (కాకా) ఫౌండేషన్ సహకారంతో జవహర్ నగర్, బాలాజీ నగర్ ప్రాంతాలలో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు సోలార్ ప్యానల్తో కూడిన తోపుడు బండ్లు పంపిణీ చేయబడ్డాయి. ఈ కార్యక్రమానికి భీమ్ దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేపుల సన్నీ హాజరయ్యారు. ఈ తోపుడు బండ్ల పంపిణీ కార్యక్రమం నిరుపేద కుటుంబాలకు ఆర్థికంగా చేయూతనిచ్చి, వారి జీవనోపాధిని మెరుగుపరచడంలో ఎంతగానో దోహదపడుతుంది. సోలార్ ప్యానల్తో కూడిన ఈ బండ్లు పర్యావరణ హితంగా ఉండటంతో పాటు, విద్యుత్ ఖర్చులను తగ్గించి, చిరు వ్యాపారులకు మరింత లాభదాయకంగా మారనున్నాయి. ఈ సందర్భంగా వేపుల సన్నీ మాట్లాడుతూ, డాక్టర్ వివేక్ వెంకటస్వామి ఫౌండేషన్ అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. భీమ్ దళ్ ఎల్లప్పుడూ సమాజంలోని నిరుపేద వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతుందని, భవిష్యత్తులో కూడా ఇలాంటి అనేక సేవా కార్యక్రమాలను కొనసాగిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం స్థానికులలో హర్షం వ్యక్తం చేయగా, భీమ్ దళ్ చేస్తున్న సేవలను ప్రజలు అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



**కుత్బుల్లాపూర్ జులై 18 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమినీ నాగరాజ్ గౌడ్** బాచుపల్లి విఎన్ఆర్ కాలేజీ వద్ద రోడ్డు దాటుతున్న మహిళను వేగంగా వస్తున్న కారు, బైక్ ఒకదాని తర్వాత మరొకటి ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మెదక్ జిల్లా రామాయంపేటకు చెందిన రేణుక (43) బాచుపల్లిలోని బోనాలు పండగ సందర్భంగా తన కూతురు ఇంటికి వెళ్తుంది. ఈ క్రమంలోనే బాచుపల్లి విఎన్ఆర్ కాలేజ్ ఎదురుగా రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని బైక్ ఢీకొట్టి తరువాత కారు ఢీ కొట్టడం తో రేణుక అక్కడికక్కడే మృతి చెందింది. సంఘటన స్థలానికి చేరుకున్న బాచుపల్లి పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి కి తరలించారు. ఈ మేరకు బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# సీఎంఆర్ఎఫ్ పేద, మధ్య తరగతి ప్రజలకు వరం - మందుముల పరమేశ్వర్‌రెడ్డి చెక్కుల పంపిణీ



**కాప్రా జూలై 18:** సీఎంఆర్ఎఫ్ పేద, మధ్య తరగతి ప్రజలకు వరంగా మారిందని ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి అర్హులందరికీ కూడా సీఎంఆర్ఎఫ్ కింద మెడికల్ బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నట్టుగా తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గం చెందిన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం పరమేశ్వర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిలుక శైలజ రూ 60 వేలు, శివరాత్రి నరేష్ రూ 47 వేలు పూజల ప్రతాప్ రూ 60 వేలు ముదిగొండ సుభద్ర రూ 60 వేలు కే వెంకటేష్ రూ 55 వేలు ఎం వి ముత్తు రూ 60 వేలు పింకీ దేవి రూ 39 వేలు తిరుపతి రాధిక రూ 36 వేలు కే అప్పారావు రూ 60 వేలు చొప్పున మంజూరైన చెక్కులను పరమేశ్వర్‌రెడ్డి లబ్ధిదారులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ అధ్యక్షులు బాకారం లక్ష్మణ్ ,హబ్సిగూడ డివిజన్ అధ్యక్షుడు జి విజయకుమార్ ,మేడ్చల్ మల్కాజిగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విట్టల్ నాయక్ ,ఈగ ఆంజనేయులు ముదిరాజ్, కొంపల్లి బాలరాజ్, ఆకిటి ఆగం రెడ్డి, తుమ్మల దేవి రెడ్డి, లూకాస్, గరిక సుధాకర్, అశోక్,భాస్కర్ రెడ్డి, సంతోష్ రెడ్డి, మహేష్ యాదవ్,లింగం, రాజన్న,బోడిగా మల్లేష్, ప్రశాంత్, మోహన్ మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# ఆనంద్‌బాగ్‌లో శ్రీవారి బ్రహ్మోత్సవాలు

## : ఆధ్యాత్మిక శోభకు సన్నాహాలు




**తెలంగాణ షాన్, జులై 18:** మల్కాజ్గిరి ,ఆధ్యాత్మిక ప్రశాంతతను అందించే ఆలయాలు మన సంస్కృతిలో అంతర్భాగమని, ఆనంద్‌బాగ్‌లోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ అర్చకులు మరియు ఆలయ అభివృద్ధి సభ్యులు పునరుద్ఘాటించారు. శుక్రవారం ఆలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో, శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన అనంతరం, ఉత్సవాల వివరాలను వెల్లడించారు. శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వచ్చే నెల ఆగస్టు 5, మంగళవారం (శ్రావణ శుద్ధ ఏకాదశి) నుండి ఆగస్టు 9, శనివారం (శ్రావణ శుద్ధ పౌర్ణమి) వరకు ఐదు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.బి. రవీందర్ రెడ్డి పర్యవేక్షణలో ఈ బ్రహ్మోత్సవాలు జరుగుతాయని సభ్యులు తెలిపారు. ప్రతీ సంవత్సరం వలె ఈ సంవత్సరం కూడా అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల విశేషాలు:

మొదటి రోజు (ఆగస్టు 5, మంగళవారం): కోయిల అల్వార్ తిరుమంజనం, సాయంత్రం 5 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం, పల్లకీ సేవ, స్వస్తి వాచకం, శ్రీ విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, ఋత్వీక్వరణం, మృత్సం సంగ్రహం, అంకురార్పణ, ధ్వజపటాదివాసం, ఆరగింపు, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి వంటి కార్యక్రమాలు నిర్వహించబడతాయి. రెండవ రోజు (ఆగస్టు 6, బుధవారం): రుద్ర హోమం జరుగనున్నది. మూడవ రోజు (ఆగస్టు 7, గురువారం): ఉదయం 10 గంటలకు ఎదుర్కోళ్ళు అనంతరం శ్రీవారి కళ్యాణ మహోత్సవం నిర్వహించబడును. సాయంత్రం 6 గంటలకు హనుమత్ సేవ మరియు రథోత్సవం జరుగనున్నది.

నాల్గవ రోజు (ఆగస్టు 8, శుక్రవారం): సుదర్శన హోమం, మహా పూర్ణాహుతి, చక్రస్నానం, వసంతోత్సవం, మహాకుంభ సంప్రోక్షణ అనంతరం ఆరగింపు, మంగళా శాసనము, తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించబడతాయి. సాయంత్రం శ్రీ పుష్పయాగం, ద్వాదశారాధన, సప్తావర్ణాలు, ధూపోత్సవం, డోలోత్సవం, దర్బార్ సేవ, తీర్థ ప్రసాద గోష్ఠి వంటి కార్యక్రమాలు ఉంటాయి.

బ్రహ్మోత్సవాలలో చివరి రోజు (ఆగస్టు 9, శనివారం): ఉత్సవాంత స్నపనం, అరవణై కైంకర్యం, ఆరగింపు, మంగళా శాసనము, ఆచార్య ఋత్విక్ సన్మానం, తీర్థ ప్రసాద గోష్ఠి వంటి కార్యక్రమాలు నిర్వహించబడతాయి. ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై వేంకట రమణాచార్యులు మాట్లాడుతూ, ఆలయంలో పాంచరాత్ర ఆగమం ప్రకారం పూజాది కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు ముడుంబై వేంకట రమణాచార్యులు, అర్చకులు తులసి వెంకట రమణాచార్యులు, ఆలయ క్లార్క్ సంద్ర సుధాకర్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సానాది శంకర్, పి. గణేష్, ఎం. హేమంత్ కుమార్, జి. శ్రీధర్, వి. రవీందర్ రెడ్డి, వి. అగోండ, అనిత, పద్మావతి, రత్నాకర్ రావు, సురేష్ కుమార్ సింగ్, మాజీ చైర్మన్ రాందాస్ సంతోష్ ముదిరాజ్, ఆలయ మాజీ ధర్మకర్త ఎం. రవీందర్ తదితరులు పాల్గొన్నారు. భక్తులందరూ ఈ బ్రహ్మోత్సవాలలో పాల్గొని శ్రీవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ కోరింది.

# రాచకొండలో విస్తృత తనిఖీలు: భద్రత పెంపునకు పోలీసుల చర్యలు










హైదరాబాద్, తెలంగాణ షాన్ , జూలై 18:
రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు ఐపీఎస్ ఆదేశాల మేరకు,శుక్రవారం రాచకొండలోని 42 ప్రాంతాల్లో విస్తృతంగా "నాకా బందీ" (వాహన తనిఖీ) కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రెండు గంటల పాటు సాగిన ఈ ఆపరేషన్, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా, ఉన్నతాధికారుల పర్యవేక్షణలో సమర్థవంతంగా జరిగింది. వర్ష ప్రభావం లేని ప్రాంతాలను ఎంపిక చేసుకుని ఈ తనిఖీలు చేపట్టారు. నిషేధిత వస్తువులు, అక్రమ మారణాయుధాలు, మరియు అనధికార వాహనాల రవాణాను అరికట్టడమే ఈ తనిఖీల ముఖ్య ఉద్దేశ్యం. ప్రజల సహకారంతో ఈ నాకా బందీ కార్యక్రమం శాంతియుతంగా కొనసాగిందని రాచకొండ పోలీస్ అధికారులు తెలిపారు. భద్రతకు సంబంధించి అవసరమైతే రాబోయే రోజుల్లో ఇలాంటి తనిఖీలను మరింత కట్టుదిట్టంగా కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.

# జవహర్ నగర్ లో ఇన్స్పెక్టర్ సైదయ్య ఆధ్వర్యంలో పోలీసుల నాకా బందీ: ఆరు బైకులు సీజ్, అనుమానితుల ఫింగర్ ప్రింట్స్ పరిశీలన
















**జవహర్ నగర్, తెలంగాణ షాన్, జులై 18:**
ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, ఇన్‌స్పెక్టర్ సైదయ్య ఆధ్వర్యంలో జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అమ్ముగూడ రోడ్డు నుండి యాప్రాల్ ఎక్స్ రోడ్డు వరకు సమగ్ర "నాకా బందీ" (వాహన తనిఖీ) ఆపరేషన్ నిర్వహించారు. రోడ్డు భద్రతను మెరుగుపరచడం, ట్రాఫిక్ నిబంధనలను అమలు చేయడం, మరియు జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అనుమానాస్పద వ్యక్తులను గుర్తించడం ఈ కార్యక్రమం యొక్క లక్ష్యం. ఈ ఆపరేషన్‌లో పెద్ద సంఖ్యలో సిబ్బంది పాల్గొన్నారు. ఈ బృందంలో ఇన్‌స్పెక్టర్ సైదయ్య, ఒక డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్, తొమ్మిది మంది సబ్-ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు అసిస్టెంట్ సబ్-ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు/ఉమెన్ హెడ్ కానిస్టేబుళ్లు, పద్నాలుగు మంది పోలీస్ కానిస్టేబుళ్లు/హోంగార్డులు, తొమ్మిది మంది ఆర్మ్డ్ రిజర్వ్ సిబ్బంది, మరియు నలుగురు ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది సహా మొత్తం 38 మంది పాల్గొన్నారు. పోలీసులు రెండు చోట్ల చెక్ పాయింట్లు ఏర్పాటు చేసి, యాప్రాల్ ఎక్స్ రోడ్డు వైపు మరియు అమ్ముగూడ వైపు వెళ్లే వాహనాలను సమర్థవంతంగా తనిఖీ చేశారు. తనిఖీల సందర్భంగా, డ్రైవింగ్ లైసెన్స్ లేని ఆరు బైకులను సీజ్ చేశారు. ట్రాఫిక్ సిబ్బంది సరైన నంబర్ ప్లేట్లు లేని వాహనాలకు చలాన్లు విధించారు, మోటారు వాహన నిబంధనలను కచ్చితంగా పాటించేలా చూశారు. ఇంకా, క్రైమ్ సిబ్బంది క్రియాశీలంగా పాల్గొని, నేర రికార్డులు లేదా అక్రమ కార్యకలాపాలలో ప్రమేయం ఉన్న వ్యక్తులను గుర్తించే లక్ష్యంతో అనుమానితుల వేలిముద్రలను పాపిలియన్ పరికరం సహాయంతో తనిఖీ చేశారు. ప్రజల భద్రతను కాపాడటానికి, నేరాలను అరికట్టడానికి, మరియు చట్టాన్ని అమలు చేయడానికి ఇటువంటి కార్యకలాపాలు అత్యంత ముఖ్యమైనవని జవహర్ నగర్ పోలీసులు తెలిపారు.

# కైసర్ నగర్ లో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్







**కుత్బుల్లాపూర్ జులై 18 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమినీ నాగరాజ్ గౌడ్**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం డివిజన్,కైసర్ నగర్ లో విన్నపం మేరకు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ సంబంధిత అధికారులతో మాట్లాడి కైసర్ నగర్ అభివృద్ధిలో భాగంగా మజీద్-ఇ-రెహ్మానియా నుండి గణేష్ కట్ట రోడ్డు చివరి వరకు 54 లక్షలతో సిసి రోడ్డు మంజూరు చేపించారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ సిసి రోడ్లు మంజూరైన బస్తిలో బస్తివాసులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ. ప్రజా ప్రభుత్వంలో,ప్రజా సంక్షేమమే ముఖ్యంగా గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి ముందుకెళ్తున్నారని అన్నారు. కైసర్ నగర్ అభివృద్ధికి ఇంచార్జ్ మంత్రివర్యులు శ్రీ దుద్దిళ్ళ శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్ళిన వెంటనే స్పందిచారు. కాబట్టి కుత్బుల్లాపూర్ నియోజకవర్గం తరుపున వారికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో కైసర్ నగర్ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ తౌసిఫ్ అహ్మద్, మహమ్మద్ దావూద్, అబ్దుల్ జమీల్, మహమ్మద్ జబ్బార్, మహమ్మద్ సలీం, మహమ్మద్ మహమూద్, మహమ్మద్ ఖుద్దుస్, రాములు, నర్సాగౌడ్, భవాని అక్క, మహమ్మద్ అలీమ్, మహబూబ్, హబీబ్ గార్లతో పాటు కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

# బోనాల పండుగ ఏర్పాట్లకు విరాళం అందజేత

కాప్రా జులై 18: కుషాయిగూడ పోచమ్మ దేవస్థానంలో ఈనెల 20 న బోనాల సందర్భంగా ఏర్పాట్లు నిర్వహించేందుకు శుక్రవారం ఆలయ ప్రాంగణంలో బోనాల ఉత్సవ నిర్వాహకులకు మారుతీ మిత్రమండలి ఆధ్వర్యంలో రూ: 10,000/- అందజేశారు. అదేవిధంగా ఆలయంలో కూడా గడియారాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హనుమంతు, మచ్చ బాబు, వేణు గోపాల్ చారి, నాలచర్ల ఈశ్వర్, జనార్ధన్, శివ, శ్రీనివాస్, రాజేష్, ఆంజనేయులు, కాసుల సురేష్, అనిల్ యాదవ్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ విద్యాశాఖ మంత్రిని వెంటనే కేటాయించాలి

## - విద్యారంగ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన కమిటీని ఏర్పాటు చేయాలి: ఎం చంద్రకాంత్ యుఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు

**కుత్బుల్లాపూర్ జూలై 18 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమిని నాగరాజు గౌడ్** : తెలంగాణ విద్యాశాఖ మంత్రిని వెంటనే కేటాయించాలని యు ఎస్ ఎఫ్ ఐ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఎం .చంద్రకాంత్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యుఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఎం చంద్రకాంత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడుస్తున్నా కూడా ఇంతవరకు విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడం సిగ్గుచేటు. ఈనాడు రాష్ట్రంలో విద్యారంగం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుంటే విద్యాశాఖ మంత్రిని కేటాయించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. పేద మధ్యతరగతి విద్యార్థులు చదువుకు దూరమయ్యే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న విద్యావ్యతిరేక విధానాలను యుఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కమిటీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నాం. ఒకపక్క స్కాలర్షిప్ , ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల కాకపోవడంతో పేద మధ్యతరగతి విద్యార్థులు నానా అవస్థలు పడుతున్న రాష్ట్ర ప్రభుత్వం మాత్రం మొద్దు నిద్రను వీడకుండా స్కాలర్షిప్లు , ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చలగాటమాడుతుంది. ఇంకొక పక్క ప్రభుత్వ పాఠశాలలో ఎక్కడి సమస్యలు అక్కడే నెలకొన్నలు ఉన్నాయి . రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మొద్దు నిద్ర విడి విద్యాశాఖ మంత్రిని కేటాయించాలని అదేవిధంగా విద్యారంగ అభివృద్ధికై ఒక ప్రత్యేకమైన కమిటీని నియమించి పూర్తిస్థాయిలో విద్యారంగానికి ప్రత్యేకమైన నిధులను కేటాయించి విద్యారంగా అభివృద్ధికై రాష్ట్రప్రభుత్వం పూర్తిస్థాయిలో కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరడం జరిగింది.



# మేడ్చల్ ఎక్సైజ్ పి.యస్ పరిధిలో కల్తీకల్లు కలకలం

## - ఎస్ వి ఎస్ బ్రాండ్ పేరుతో పాల ప్యాకెట్ తరహాలో జోరుగా విక్రయాలు

**కుత్బుల్లాపూర్ జూలై 18 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమినీ నాగరాజ్ గౌడ్** మేడ్చల్ ఎక్సైజ్ పి.యస్ పరిధిలో కండ్లకోయ ,అయోధ్య నగర్ ,గుండ్ల పోచంపల్లి పరిశర ప్రాంతాలలో కల్తీకల్లు దందా చాప కింద నీరులా సాగుతోంది,,ఎస్ వి ఎస్ పేరుతో ప్యాకెట్ లో కల్తీ కళ్ళు నింపి అమ్మకాలు కొన సాగిస్తున్నారు. పాల ప్యాకెట్ల మాదిరిగా ప్యాక్ చేసి ఎలాంటి అనుమతులు లేకుండా కల్తీకల్లు ప్యాకెట్లను విక్రయిస్తున్నారు. రెండు రోజుల క్రితం కల్తీకల్లు స్థావరాలపై పోలీసులు దాడులు చేసి ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. మేడ్చల్ జిల్లా గుండ్ల పోచంపల్లి మున్సిపల్ పరిధిలోని కండ్లకోయ, అయోధ్య ప్రాంతాలలో ఎస్ వి ఎస్ కల్తి కళ్ళు ప్యాకెట్ల దందా సాగుతున్నట్లు సమాచారం. ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే జోరుగా కల్తీకల్లు దందా సాగుతుంది అని తెలుసుకున్న మేడ్చల్ ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించి కళ్ళు ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు..



# మన చుట్టూ ఉన్న పారిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకుంటేనే మనం ఆరోగ్యాంగా ఉంటాము: మహ్మద్ రఫీ










**కుత్బుల్లాపూర్ జూలై 18 తెలంగాణ షాన్ ప్రతినిధి జెమినీ నాగరాజ్ గౌడ్**: కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 128 చింతల్ డివిజన్ లో గల వివేకానంద్ నగర్ ప్రక్కన %ఎమీ% ఖాళీ ప్రదేశంలో పిచ్చి మొక్కలు పెరిగి ఆ స్థలంలో కొందరు రాత్రి సమయంలో చెత్త వేయడం వలన దోమలు,పాములు,పందులు,అడవిలో గల జంతువులు రావడం మరియు దుర్వసనాతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని స్థానిక నాయకుల ద్వారా తెలిసిన వెంటనే కాలనీ నాయకులతో కలిసి JCBతో ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించిన మహ్మద్ రఫీ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీ ప్రజలందరూ GHMC చెత్త ఆటోలోనే చెత్త వేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శేఖర్ రావు, సంక్షేమ సంఘము అధ్యక్షులు సత్యం, ప్రధాన కార్యదర్శి సంతోష్, మాజీ అధ్యక్షులు నర్సింహా, చలమారెడ్డి, BRS పార్టీ అధ్యక్షులు యాదగిరి, గుండ్డప్ప, అలీ, నరేష్, వహీద్ పాల్గొన్నారు.

# కేటీఆర్, లోకేష్ డిన్నర్ మీటింగ్ .

**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో సంచలనం జరగబోతుందా? ఉప్పు, నిప్పులు కలవడానికి కారణాలేంటి? ఇదే ఇప్పుడు తెలంగాణలో హాట్ టాపిక్ గా మారింది. బీఆర్ఎస్, తెలుగుదేశం పార్టీ రెండూ ఒకరంటే ఒకరికి పడవు. అది జగమెరిగిన సత్యం. కేసీఆర్, జగన్ కు, చంద్రబాబు, రేవంత్ రెడ్డిలకు మధ్య ఉన్న కెమెస్ట్రీ అందరికీ తెలుసు. తెలుగుదేశం పార్టీ నుంచి వచ్చిన కేసీఆర్ వేరే పార్టీ పెట్టుకుని ముఖ్యమంత్రి అయినప్పటికీ చంద్రబాబును తొలి నుంచి వ్యతిరేకించడంలో ముందుంటారు. అందుకే జగన్ కు దగ్గరయ్యారు. జగన్, కేసీఆర్ లు రెండు రాష్ట్రాలకు ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య అనేక సార్లు చర్చలు జరిగాయి. ఒకరి వద్దకు మరొకరు వెళ్లి కలుసుకుని కష్టసుఖాలను మాట్లాడుకున్నారు. ఇప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్డీఏ కూటమిలో భాగస్వామిగా ఉన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు జాతీయ స్థాయిలో పడకపోయినా, వీరిద్దరి మధ్య సత్సంబంధాలున్నాయన్నది వాస్తవం. అందుకే ఇప్పటికే ఒకసారి హైదరాబాద్ లోని ప్రజాభవన్ లో సమావేశమై ఇరు రాష్ట్రాల మధ్య విభజన సందర్భంగా ఏర్పడిన సమస్యలను పరిష్కరించుకునే దిశగా చర్చలు జరిగాయి. తాజాగా ఢిల్లీలో గోదావరి, కృష్ణా నదీ జలాల వాటాపై కూడా ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం జరిగింది. ఎవరు అధికారంలో ఉన్నా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సయోధ్య కలిగి ఉండటం అందరూ హర్షించదగ్గ విషయమే. కానీ ఇక్కడ అర్థం కాని విషయమేంటంటే.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమావేశం అవ్వడంపైనే చర్చ జరుగుతుంది. ఇది అఫిషియల్ మీటింగ్ కాదు. డిన్నర్ మీటింగ్ అని సాక్షాత్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఇరువురు నేతలు యువ నేతలు కలవడంతో ఖచ్చితంగా తాజా రాజకీయాలపై చర్చ జరిగి ఉంటుందన్న



అంచనాలు మాత్రం వినపడుతున్నాయి. అయితే ఏ అంశంపై చర్చించడానికి కేటీఆర్, లోకేశ్ కలిశారన్నది తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. స్థానిక సంస్థల ఎన్నికలపై వీళ్లిద్దరూ మాట్లాడుకున్నారా? అంటే రెండు పార్టీలు కలసి పోటీ చేసే అవకాశం లేదు కాబట్టి ఆ విషయం మాత్రం కాదని అందరికీ తెలుసు. కాకుంటే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపైనే కేటీఆర్, లోకేశ్ చర్చించి ఉంటారని అంటున్నారు. జూబ్లీ హిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి చెందినప్పుడు కుటుంబ సభ్యులను పరామర్శించడానికి వచ్చారు. మాగంటి గోపీనాథ్ 2014లో టీడీపీ గుర్తుపై గెలిచి తర్వాత బీఆర్ఎస్ లోకి మారారు. త్వరలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరగనుంది. ఈ నేపథ్యంలోనే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మాట్లాడుకునేందుకు మాత్రమే ఈ ఇద్దరు నేతలు కలిసినట్లు ప్రచారం జరుగుతుంది. మాగంటి గోపీనాథ్ కుటుంబం నుంచి ఎవరినైనా పోటీకి దింపాలా? మరెవరైనా అభ్యర్థిని బరిలోకి దింపితే ఎలా ఉంటుందన్న దానిపై ఇద్దరి మధ్య చర్చ జరుగినట్లు తెలిసింది. కేటీఆర్, లోకేశ్ భేటీలో కేవలం జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక మీద మాత్రమే చర్చ జరిగి ఉండవచ్చున్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. మొత్తం మీద ఇద్దరు యువనేతల కలయిక మాత్రం తెలంగాణ రాజకీయాల్లో కాక పుట్టిస్తుందనే చెప్పాలి.

# మహారాష్ట్రలోకి తెలంగాణ గ్రామాలు

**అదిలాబాద్ :** నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో దాదాపు 13 ఏళ్లు పోరాడిన తెలంగాణ సమాజం చివరకు 2014లో ప్రత్యేక రాష్ట్రం సాధించుకుంది. రాష్ట్ర విభజన సమయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు గ్రామాలను ఏపీలో కలిపేశారు. 11 ఏళ్లు గడిచినా ఆ ఏడు గ్రామాల ప్రజలు ఇప్పటికీ తమను తెలంగాణలో విలీనం చేయాలని కోరుతున్నారు. తెలంగాణలో పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఇందుకోసం ఎలాంటి ప్రయత్నం చేయలేదు. ఇప్పుడు అధికారం పోగానే మళ్లీ ఏడు గ్రామాలను తెలంగాణలో కలపాలని కోరుతోంది. ఇక ఇప్పుడు మరో 14 గ్రామాలను లాక్కునేందుకు మహారాష్ట్రలోని బీజేపీ సర్కార్ పావులు కదుపుతోంది.తెలంగాణలోని రజురా, జివాటి తాలూకాల్లో ఉన్న 14 గ్రామాలను మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లాలో విలీనం చేసే ప్రక్రియను మహారాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. మహారాష్ట్ర రెవెన్యూ మంత్రి చంద్రశేఖర్ బవన్కులే ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ గ్రామాలు దీర్ఘకాలంగా సరిహద్దు వివాదంలో ఉన్నాయి. ఈ నిర్ణయం ఈ సమస్యను పరిష్కరించడంలో కీలకమైన అడుగుగా భావిస్తున్నారు. ఈ 14 గ్రామాల ప్రజలు తమను ఎప్పటి నుంచో మహారాష్ట్రలో విలీనం చేయాలని కోరుతున్నారట. జమాబందీ రికార్డుల ప్రకారం, ఈ గ్రామాలు మహారాష్ట్ర భూభాగంలోనే ఉన్నట్లు చూపుతున్నాయని మహారాష్ట్ర మంత్రి బవన్కులే తెలిపారు. ఈ గ్రామాలు ప్రస్తుతం తెలంగాణ, మహారాష్ట్ర రెండు రాష్ట్రాల ఓటరు జాబితాలో ఉన్నాయి. దీని వల్ల గ్రామస్తులు రెండు రాష్ట్రాల నుంచి ప్రయోజనాలు పొందుతున్నారు.ఈ గ్రామాలు 1956 నుంచి మహారాష్ట్ర, తెలంగాణ (గతంలో ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా) మధ్య 80 చదరపు కిలోమీటర్ల



వివాదాస్పద భూభాగంలో ఉన్నాయి. ఈ సమస్య సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉంది, కానీ గ్రామస్తులు రెండు రాష్ట్రాల నుంచి?ప్రయోజనాలు పొందుతూ రెండు రాష్ట్రాల గుర్తింపును కలిగి ఉన్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఈ విలీన నిర్ణయాన్ని సమర్థించారు. ఇది దీర్ఘకాల సమస్యకు పరిష్కారం కాగలదని భావిస్తున్నారు.ఈ గ్రామాల్లోని జనాభా ప్రధానంగా మరాఠీ మాట్లాడే ఎస్సీ సామాజిక వర్గాలవారు. 1970?71 నుంచి మహారాష్ట్రలోని నాందేడ్, పర్భణీ, జల్నా జిల్లాల నుంచి వలస వచ్చిన కొంతమంది ముస్లింలు ఉన్నారు. ఈ విలీనం వారి అడ్మినిస్ట్రేటివ్ సమస్యలను పరిష్కరించి, భూమి హక్కులను స్థిరీకరించడంతోపాటు రాజకీయ, ఆర్థిక స్థిరత్వాన్ని తీసుకురావాలని మహారాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అయితే తెలంగాణ ప్రజలు మాత్రం కేంద్రంలో, మహారాష్ట్రలో అధికారంలో ఉన్నామని మా గ్రామాలను లాక్కుంటారా.. ఏమిటీ అరాచకం అని ప్రశ్నిస్తున్నారు

# సీజనల్ వ్యాధుల పట్ల సింగరేణి హై స్కూల్ విద్యార్థులు అప్రమత్తంగా ఉండండి : జిఎం వీసం. కృష్ణయ్య

భద్రాద్రి కొత్తగూడెం : ఇల్లందు ఏరియా జనరల్ మేనేజర్ వి.కృష్ణయ్య ఆదేశాల మేరకు సింగరేణి హై స్కూల్ లలో వర్షాకాలంలో సంక్రమించే సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్ డాక్టర్ డి. లలిత అన్నారు. ఈ సందర్భంగా హెల్త్ ఆఫీసర్ డాక్టర్ డి.లలిత మాట్లాడుతూ వర్షాలతో ఎక్కువ నీరు నిలవడం ద్వారా దోమల బెడదత తీవ్రంగా ఉంటుందని, నివాస ప్రాంతాల్లో మురికి నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తద్వారా దోమలు దరిచేరవని డెంగ్యూ, మలేరియా లాంటి ప్రాణాంతక వ్యాధులు సోకకుండా జాగ్రత్తలుతీసుకోవాలని అన్నారు.వర్షాకాలంలో కలుషితమైన నీరు, ఆహారం, ఈగలు మరియు దోమల వల్ల వ్యాధులు ప్రబాలే ప్రమాదం ఉంది. ముఖ్యంగా టైఫాయిడ్, కామెర్లు, విరోచనాలు, మలేరియా, డెంగ్యు వంటి వ్యాధులు ప్రబలుతాయి. కాచి చల్లార్చిన నీటిని త్రాగడం, బాగా ఉడికించిన ఆహారాన్ని తీసుకోవడం, నీటి పాత్రలపై, వంట పాత్రలపై మూత పెట్టి ఉంచడం, మల విసర్జన చేసిన తర్వాత, ఆహారం తినే ముందు చేతులను సబ్బుతో కడుక్కోవడం వంటి చర్యల ద్వారా ఆరోగ్య సమస్యలు రాకుండా చూసుకోవచ్చు.దోమలు పగటిపూట కుడతాయని, దోమ కుట్టిన ఐదు నుంచి ఎనిమిది రోజుల తర్వాత వ్యాధి లక్షణాలు కనిపిస్తుంటాయన్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండటం వల్ల దోమల బెడద ఎక్కువగా ఉంటుందని, దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను మట్టిలో పూడ్చడం, మురికి కాల్వల్లో చెత్త పేరుకోకుండా చూసుకోవడం, ఇంటి పరిసరాల్లో కొబ్బరి చిప్పలు పగిలిన కుండలు ఉంటే వాటిని తీసివేయడం ద్వారా దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవచ్చు దోమకాటు బారిన పడకుండా తగు జాగ్రత్తలు (దోమతెరలు, పొడవు చేతులుండే దుస్తులు) తీసుకోవడం వల్ల మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అని అన్నారు. ఈ కాలంలోనే డెంగ్యూ వేగంగా వ్యాప్తి చెందుతుందని, ఈ వ్యాధి లక్షణాలు ఎలా ఉంటాయో ప్రతి ఒక్కరూ తెలుసుకోవడం మంచిదన్నారు. డెంగ్యూను నివారించడానికి ఎలాంటి టీకాలు లేవు. దోమ కాటుకు గురి కాకుండా నివారణ చర్యలు మాత్రమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, నీరు నిలువ ఉంటే వారానికి ఒకసారి శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి స్కూల్ హెడ్ మాస్టర్ బి.శ్రీనివాస్, ఇన్ ఛార్జ్ హెయం బొదుల శ్రీనివాస్, సినియర్ టీచర్స్ విషు ప్రియ, ధనలక్ష్మి, యాన్.సి.సి. మాస్టర్ శ్రీనివాస్ మరియు స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థుల ఆనందం కోసం సైకిళ్లు పంపిణీ చేసిన బండి

**హుజురాబాద్ :** పేద విద్యార్థుల జీవితాలలో కొత్త మార్గాన్ని సృష్టిస్తున్న మోడీ గిఫ్ట్? వాటిని స్వయంగా అందజేస్తూ విద్యార్థుల ఆనందాన్ని పంచుకున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్. ప్రజా సంగ్రామ యాత్రలో చూసిన పేద పిల్లల కష్టాలను చూసి మర్చిపోకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థుల కోసం సైకిళ్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. గురువారం ప్రభుత్వ హైస్కూల్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో టెన్త్ చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను అందజేశారు. విద్యార్థులతో కలిసి సైకిల్ ర్యాలీలో కూడా పాల్గొన్న బండి సంజయ్ కొంతసేపు తానే స్వయంగా సైకిల్ తొక్కారు. విద్యార్థుల్లో ఆవిర్భవించిన ఆనందానికి అవధులే లేకుండా, చప్పట్లు, నినాదాలతో హర్షధ్వానాలు చేసారు. సైకిళ్లు విద్యార్థుల తొలి ఆస్తిఇది మోదీ గిఫ్ట్. మీ తొలి ఆస్తిగా దీన్ని భావించండి. సద్వినియోగం చేసుకొని బాగా చదవండి. అంబేద్కర్, మోదీ లాంటి నాయకులను స్ఫూర్తిగా తీసుకోవాలని అని బండి సంజయ్ విద్యార్థులకు సూచించారు.ఇది ప్రభుత్వ నిధులతో కూడిన ప్రాజెక్టు కాదని, తమ నియోజకవర్గంలోని సంస్థల, దాతల సహకారంతో వచ్చిన ఆఫీ ఫండ్స్‌తో కొనుగోలు చేసిన సైకిళ్లని వివరించారు.ప్రజాసంగ్రామ యాత్రలో ఏర్పడిన ఆలోచన..పాదయాత్ర సమయంలో చెప్పులు లేని చిన్నారుల దుస్థితిని చూసిన సంజయ్? పలువురికి చెప్పులు కూడా కొనిపెట్టిన విషయాన్ని గుర్తుచేశారు. పాలమూరు ప్రాంతంలో ఓ మానసిక వికలాంగుడైన బాలుడు సైకిల్ లేక స్కూల్‌కు వెళ్లడం లేదు అని చెప్పిన ఘటన తనను ఎంతో కలిచివేసిందన్నారు. వెంటనే ఆ బాబుకు సైకిల్ కొనిపెట్టగా, అప్పటి



నుంచి స్కూల్‌కు రెగ్యులర్‌గా వెళ్తున్నాడని చెప్పారు.“విద్యలో మోదీ ప్రభుత్వం ప్రాధాన్యం”విద్య రంగంలో మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులు గురించి మాట్లాడిన బండి సంజయ్? 2014లో 68 వేల కోట్ల కేటాయింపుతో ఉన్న విద్యా బడ్జెట్, 2025–26లో లక్షా 28 వేల కోట్లకు పెరిగిందని తెలిపారు. భేటీ బచావో భేటీ పడావో సమగ్ర శిక్షా అభియాన్ నవోదయ ఏకలవ్య సైనిక్ స్కూల్స్ వంటి పథకాల ద్వారా విద్యను సామాన్యులకు అందుబాటులోకి తెచ్చారని చెప్పారు.త్వరలో మోదీ కిట్స్ పంపిణీసైకిళ్లతో పాటు త్వరలోనే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఒఐఉ నుండి 6వ తరగతి విద్యార్థులకు “మోదీ కిట్స్” అందజేస్తామని చెప్పారు. వీటిలో స్కూల్ బ్యాగ్, వాటర్ బాటిల్, పెన్నులు, పెన్సిళ్లు, నోటుబుక్స్, రబ్బర్లు ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్ డా. అశ్విని, జిల్లా విద్యాధికారి శ్రీరామ్ మొండయ్య, హనుమకొండ జిల్లా విద్యాధికారి వాసంతి, ఆర్డీవో రమేష్, మున్సిపల్ కమిషనర్ కే.సమ్మయ్య బిజెపి జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యతో పాటు క్రీడాలోనూ రాణించాలి : జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**జయశంకర్ భూపాలపల్లి :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలోను రాణించి నెంబర్ వన్ స్థాయికి చేరాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం జిల్లాలోని చిట్యాల మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని (కేజీబీవీ) జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మిక తనిఖీ చేశారు. 10 వ తరగతి గదిని పరిశీలించి విద్యార్థులతో హిందీ పాఠం చదివించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యలో బాగా రాణించాలంటే ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు నిర్వహించాలని ప్రిన్సిపల్ కు సూచించారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా ఉండాలని, తల్లిదండ్రులు నుండి దూరం వచ్చి చదువుకుంటున్నారని, విద్యార్థులను మన పిల్లలుగా భావించి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతూ, విద్యా ప్రగతికి బాటలు వేయాలని స్పష్టం చేశారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. స్టోర్ రూము, వంటగదిని పరిశీలించి వంట గది నిర్వహణను స్వయంగా ఫోటో తీసుకున్నారు. పాఠశాల నిర్వహణను పరిశీలించిన కలెక్టర్ భోజనం నాణ్యత, పరిశుభ్రత, నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్భోజనం బావుంది... స్టోర్ రూమ్ నిర్వహణ బావుంది.. ఇలానే మంచిగా నిర్వహించండని సిబ్బందిని అభినందించారు. విద్యార్థులకు వసతి, భోజనంతో విద్యాబ్యాసానికి మంచి వాతావరణం కల్పించడంలో ఉపాధ్యాయుల కృషిని ప్రశంసించారు.భోజన సమయంలో విద్యార్థులతో రాహుల్ శర్మ స్నేహపూర్వకంగా మాట్లాడి, వారి అభిప్రాయాలను సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో మురుగునీరు వెళ్లేందుకు అవుట్ లెట్, కాంపౌండ్ వాల్, సోలార్ విద్యుత్తు సౌకర్యం కల్పించాలని ప్రిన్సిపాల్ కోరగా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాజేందర్, ఎంపీడీవో జయశ్రీ, ప్రిన్సిపల్ సుమలత తదితర అధికారులు పాల్గొన్నారు.

Edited, Published and Owned by **Ramancharla Srikanth** & Printed by **V. Raj Kumar** at **RK PRINTERS**, # 1-7-210/2, Kamala Nagar, Opp ECIL Bus Stop, ECIL, Hyderabad, Telangana - 500062 & Published from Sri Lakshmi Narsimha Colony, Flat No.106. Balaji Nagar, Kapra, Medchal Dist., Telangana - 500087. **RNI No.: TELTEL/2023/90269**. Editor: **RAMANCHARLA SRIKANTH**, Mob: **9963708331**, Email: telanganashaan331@gmail.com